1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
RNI : APTEL / 2023 / 89152
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 3 సంచిక : 135
శనివారం 23 మే 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.



# ఉపాధి కల్పన మా బ్రాండు.. గొడ్డలి జగన్ బ్రాండు



(షణ్ముఖ వెలుగు, కడప,మే 22)
రాయలసీమను రతనాల సీమగా మార్చడమే తమ అజెండా అని మంత్రి నారా లోకేశ్ (ఛీఖీఝ రాశీనివంప్ష) అన్నారు. కడప జిల్లా టి.కోడూరు వద్ద సోలార్ ప్లాంట్ల ప్రారంభోత్సవంలో మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి లోకేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ఛార్జీలు తగ్గించే దిశగా గొట్టిపాటి కృషి చేస్తున్నారని తెలిపారు. “11 నెలల్లో ప్రాజెక్టు సాధించడం వెనుక రైతుల త్యాగం ఉంది.

# భానుడి భగభగలకు అడ్డుచక్రం

**భూగోళాన్ని చల్లబరిచే సాంకేతికత**

**అభివృద్ధి చేస్తున్న అమెరికా-ఇజ్రాయెల్ స్టార్టప్**



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 22)
ఓ వైపు ఎండల మంట... మరోచోట కరవుకాటకాలు... ఇంకో ప్రాంతంలో కార్చిచ్చులు.. భూతాపం దుష్పరిణామాల్ని నేటి ప్రపంచం కళ్లారా చూస్తోంది. ఈ విపత్తుల నుంచి మానవాళిని ఎలా కాపాడుకోవాలి? భూమిని చల్లబరచడానికి ఏం చేయాలి? తీక్షణ సూర్యకిరణాల్ని అడ్డుకోగలిగితే ఈ విపత్తుల్నినివారించొచ్చు కదా!! ఈ దిశగానే ఆలోచించింది ఓ జియో ఇంజినీరింగ్ సంస్థ. భూగ్రహాన్ని చల్లబరిచే ప్రణాళికలను అది తాజాగా తెరపైకి తెచ్చింది. ఆ సంస్థ పేరు స్టార్‌డస్ట్ సొల్యూషన్స్. ఇది అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త స్టార్టప్. సూర్యకిరణాలు భూమిని తాకక ముందే వాటికి అంతరాయం కలిగించే విధంగా మేఘాలను మార్చడం లేదా వాతావరణంలోని ఇతర లక్షణాలను సవరించడం స్టార్‌డస్ట్ ప్రాజెక్టులో కీలకాంశం. అంతరిక్షంలో భారీ సన్ షేడ్లను నిర్మించడం లేదా సముద్రాలు గ్రహించే వేడి పరిమాణాన్ని పరిమితం చేయడం, కాంతిని పరావర్తనం చెందించే సముద్రపు నురగతో బుడగల్లాంటి మిశ్రమాలను సృష్టించడం వంటి ఇతర ఆలోచనల్నీ సంస్థ చేస్తోంది. ఇందుకోసం ఇసుక రేణువుల కంటే 125 రెట్లు చిన్నవైన ఏరోసోల్ కణాలను ఉపయోగించబోతోంది. ఆ కణాల కూర్పునూ సంస్థ తాజాగా వెల్లడించింది. అవి ‘అమార్ఫస్ సిలికా’ అని పిలుచుకునే పదార్థంతో తయారయ్యాయి. ఇవి కేవలం మైక్రోస్కోప్‌తో మాత్రమే కనిపించే 0.5 మైక్రాన్ల పరిమాణంలో ఉంటాయి. ఈ గోళాకార సిలికా కణాలను భూమికి సుమారు 11 మైళ్ల ఎత్తులో భూవాతావరణంలో రెండో పొర అయిన స్ట్రాటోస్ఫియర్‌లో వెదజల్లుతారు. సూర్యకిరణాల తీక్ష్ణత నేరుగా భూమిని తాకకుండా చేయడం దీని ఉద్దేశం. ఇలా వెదజల్లిన సిలికా కణాలు తిరిగి భూమిపైకి పడుతున్నప్పుడు వాటిని పర్యవేక్షించే వ్యవస్థల్నీ స్టార్‌డస్ట్ సంస్థ తయారుచేస్తోంది. అయితే ఇలా సూర్యకిరణాల్ని అడ్డుకోవడం అత్యంత ప్రమాదకరం అనే దానిపై పెద్ద చర్చే నడుస్తోంది. ▶మిగతా 2లో

# అమరావతిలో అభివృద్ధి చూసి జగన్‌కు భయం మొదలైంది



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 22)
వైకాపా పాలనలో జగన్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టడం చంద్రబాబుకు సాధ్యం కాదనుకున్నారని, ప్రజల్లో విశ్వాసం పొందలేరని జగన్ భావించారని అన్నారు. ఎవరి ఊహకూ అందని విధంగా చంద్రబాబు సమర్థ నాయకత్వం అందిస్తున్నారని, గత రెండేళ్లుగా ఊహించని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతున్నందునే సంక్షేమం, అభివృద్ధిపై జగన్ మాట్లాడలేదని అన్నారు. రాష్ట్రానికి, దేశానికి చంద్రబాబు రోల్ మోడల్‌గా నిలుస్తున్నారని చెప్పారు. “అమరావతిలో అభివృద్ధి చూసి జగన్‌కు భయం మొదలైంది. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు 11 సీట్లు కూడా రావు. తన తాత, తండ్రి, బాబాయి మరణాలకు చంద్రబాబు కారణమని జగన్ అన్నారు. ▶మిగతా 2లో

# పాస్టర్ అభినయ్ దర్శన్ వెనుక రాజకీయ కుట్ర

**కడప జిల్లాకు చెందిన అభినయ్ కు అల్లూరి జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందన్న అనిత**

**గిరిజనులను నమ్మించి పాస్టర్ అవతారమెత్తారని వ్యాఖ్య**

**తనపై దాడి జరిగినట్టుగా ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారన్న అనిత**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 22)
క్రైస్తవ మత ప్రచారకుడు అభినయ్ దర్శన్ వ్యవహారంపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. అభినయ్ దర్శన్ వ్యవహారం వెనుక పెద్ద రాజకీయ కుట్ర కోణం దాగి ఉందనే అనుమానాన్ని వ్యక్తం చేస్తూ, దీనిపై పోలీసులు ఇప్పటికే లోతైన విచారణ జరుపుతున్నారని ఆమె వెల్లడించారు.
రాజకీయ కుట్ర కోణం లేకపోతే కడప జిల్లాకు చెందిన అభినయ్ దర్శన్... అంతదూరంలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందని హోం మంత్రి అనిత ప్రశ్నించారు. అమాయకపు గిరిజనులను ▶మిగతా 2లో

# సెప్టెంబరు నాటికి ఎంవోయూల గ్రౌండింగ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 22)
రాష్ట్రంలో ఇప్పటి వరకు ఆమోదం పొందిన ప్రాజెక్టులు, పరిశ్రమలు ఈ ఏడాది సెప్టెంబరు నాటికి గ్రౌండింగ్ కావాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. 2028 డిసెంబరు నాటికి ఉత్పత్తి ప్రారంభించేలా దృష్టి సారించాలని ఆదేశించారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదిరిన అవగాహన ఒప్పందాలు, ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులపై మంత్రుల కమిటీతో ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..‘రాష్ట్రం అనుసరిస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ఆచరణలో చూపాలి. ప్రాజెక్టుల గ్రౌండింగ్, అనుమతులు, కల్పించిన ఉపాధి వివరాలతో ▶మిగతా 2లో




# నోటిఫికేషన్ లేకుండానే స్త్రీనిధిలో 88 పోస్టుల భర్తీ

**అన్నీ జిల్లా, డివిజనల్ స్థాయి ఉద్యోగాలే**

**వైకాపా హయాంలో నియామకం.. తాజాగా వెలుగులోకి**

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు అందిన నివేదిక**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 22)
మహిళలకు స్వయం ఉపాధి కల్పనలో కీలకమైన సెర్ప్ శాఖ పరిధిలోని స్త్రీనిధి సంస్థలో వైకాపా హయాంలో నోటిఫికేషన్ లేకుండానే నియామకాలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇలా 88 మందిని నియమించారన్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇవన్నీ జిల్లా, డివిజనల్ స్థాయి పోస్టులే. ఇందులో 90 శాతం పోస్టులకు అభ్యర్థులను అప్పట్లో వైకాపా నాయకులు, స్త్రీనిధి అధికారులు సిఫార్సులు చేసినట్లు తేలింది. జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ వ్యవహారంపై తాజాగా అధికారులు తనిఖీ చేయించారు. ఒక నిర్దేశిత విధానం, రిజర్వేషన్ పాటించకుండా ఈ ఉద్యోగాలు ఇచ్చారని గుర్తించి, నివేదికను సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు అందించారు. ఈ విషయాన్ని ఆయన.. ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి తీసుకెళ్లి తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. ఇప్పటికీ లీకులు: ఐదేళ్ల పాలనలో స్త్రీనిధి సంస్థను వైకాపా సర్కారు నిర్వీర్యం చేసింది. ▶మిగతా 2లో



# హీట్ వేవ్ పై రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 22)
ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నచోట స్థానికంగా సెలవుల ప్రకటన
రాష్ట్రంలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలపై సీఎం చంద్రబాబు సమీక్ష
అమరావతి, మే 22: రాష్ట్రంలో తీవ్రస్థాయిలో నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలు, వడ గాల్పుల నేపథ్యంలో ప్రజారోగ్యం, వారి భద్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్న ప్రాంతాలను ▶మిగతా 2లో

# జగన్‌పై మంత్రి నాదెండ్ల ఫైర్..

## అన్ని విమర్శలకు ఘాటు కౌంటర్


**దీపం పథకంపై జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి నాదెండ్ల ఆరోపణ**

**మధ్యాహ్న భోజనం బియ్యంపై విమర్శలు అవగాహనారాహిత్యంతో చేసినవేనని వ్యాఖ్య**

**స్పెషల్ ఫ్లైట్లపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు.. రూ.222 కోట్లు ఖర్చు చేశారని విమర్శ**

**5 కిలోమీటర్ల దూరం కోసం హెలికాప్టర్ వాడిన ఘనత జగన్‌దేనని ఎద్దేవా**

**అమరావతి రైతుల త్యాగాన్ని గుర్తించకుండా సీఎంపై వ్యాఖ్యలు సరికాదని ఖండన**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 22)
మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ చేసిన విమర్శలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దీపం పథకం, మధ్యాహ్న భోజనం నాణ్యత, ప్రత్యేక విమానాల వినియోగం వంటి అంశాలపై జగన్ పూర్తిగా అసత్యాలు, అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాదెండ్ల మనోహర్ అన్ని విమర్శలకు గణాంకాలతో సహా ఘాటుగా సమాధానమిచ్చారు.

**దీపం పథకంపై పారదర్శకంగా ఉన్నాం**

“దీపం పథకం కింద అర్హులైన వారందరికీ గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, దీన్ని కూడా జగన్ రాజకీయం చేయడం దారుణం” అని మనోహర్ అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే నాలుగు విడతలుగా ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. ఇప్పటివరకు నాలుగు విడతల్లో దాదాపు 3.77 కోట్ల మంది లబ్ధిదారులకు రూ. 3,037 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశామని వివరించారు. ప్రస్తుతం ఐదో విడత కొనసాగుతోందని, ▶మిగతా 2లో

# భానుడి భగభగలకు అడ్డుచక్రం

**రెండు రకాల కణాలు :** స్టార్‌డస్ట్ రెండు రకాల అమార్ఫస్ సిలికా ఆధారిత కణాలను అభివృద్ధి చేస్తోంది. వాటిలో ఒకటి పూర్తిగా జీవ సురక్షితం. ధ్రువీకరణలో చాలా ముందంజలో ఉంది. సిలికా కణం మరో వెర్షన్‌లో కాల్షియం కార్బొనేట్ కోర్ ఉంటుంది. ఇది సౌర వికిరణాన్ని మరింత సమర్థంగా అడ్డుకుంటుంది. స్ఫటికాకార సిలికా కంటే.. అస్ఫటికాకార సిలికాకు భిన్నమైన పరమాణు నిర్మాణం ఉంటుంది. స్టార్‌డస్ట్ తన ప్రయోగంలో అస్ఫటికాకార సిలికానే ఉపయోగిస్తోంది. దీనివల్ల మనుషుల ఆరోగ్యానికి ముప్పు ఉండదని డబ్ల్యూహెచ్ఓ క్యాన్సర్ పరిశోధన సంస్థ చెబుతోంది.

**ప్రమాదం... అప్రమత్తత అవసరం :** భూవాతావరణాన్నే సమూలంగా మార్చేసే ఈ ప్రాజెక్టు ప్రమాదకరమని సోలార్ జియోఇంజినీరింగ్ నిపుణులు, పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. సూర్య కిరణాలను అడ్డుకోవడం అంటే మానవాళి మనుగడనే ప్రమాదంలోకి నెట్టడమవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. స్టార్‌డస్ట్ తమ సొంత ప్రమాణాల ప్రకారం భద్రతను నిర్వచించి, వాటిని తాము పాటిస్తున్నామని స్వీయ ధ్రువీకరణ తీసుకోలేదని, ఈ రంగానికి సమన్వయంతో కూడిన, చట్టబద్ధమైన, స్వతంత్ర పరిశోధన అవసరమని అలయన్స్ ఫర్ జస్ట్ డెలిబరేషన్ ఆన్ సోలార్ జియోఇంజినీరింగ్ కార్యనిర్వాహక డైరెక్టర్ శుచి తలాటి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టుకు ఏ దేశాలు లేదా సంస్థలు అనుమతి ఇస్తాయి? దాన్ని ఎక్కడెక్కడ అమలుచేస్తారు? స్టార్‌డస్ట్ ప్రణాళికలపై సమగ్ర అధ్యయనం జరుగుతోందా? అనే ప్రశ్నలకు ఇంకా స్పష్టమైన సమాధానాల్లేవు. అయినప్పటికీ ఈ ప్రాజెక్టు పేరిట స్టార్‌డస్ట్ సొల్యూషన్స్ 2023 నుంచి పెట్టుబడిదారుల నుంచి కోట్లకొద్దీ డాలర్లను సమీకరించింది.

**శిలాజ ఇంధనాల్ని మండించడం తగ్గిస్తేనే...**
**– స్టార్‌డస్ట్ సీఈఓ యనై యెద్వాబ్**

భూమిని చల్లబరచడానికి స్టార్‌డస్ట్ లాంటి కంపెనీలు ఎంతగా ప్రయత్నించినప్పటికీ.. శిలాజ ఇంధనాలను మండించడమనే మూలకారణాన్ని మాత్రం అవి పరిష్కరించలేవు. దేశాలు చమురు, గ్యాస్, బొగ్గు వినియోగాన్ని సురక్షిత స్థాయికి తగ్గించడంతో పాటు.. గాలి, సముద్రాల నుంచి అధిక వాతావరణ కాలుష్యాన్ని తొలగించే వరకు ఈ సమస్య అంత సులువుగా పరిష్కారం కాదు. సూర్యరశ్మి తీక్షణతను అడ్డుకోగలిగే సాంకేతికతలోని అన్ని సవాళ్లకు, ఆందోళనలకు మేం పటిష్టమైన, శాస్త్రీయ పరిష్కారాలను అందిస్తాం. ఈ సాంకేతిక సురక్షితమైనది, ఆచారణాత్మకమైనది, నియంత్రించదగినదని నిరూపిస్తే ప్రభుత్వాలు దాన్ని పరిగణనలోకి తీసుకుంటాయి.

# అమరావతిలో అభివృద్ధి చూసి జగన్‌కు భయం మొదలైంది

తాను చేసిన వ్యవహారాలన్నీ చంద్రబాబు చేసినట్టు జగన్ చెప్పారు. ఇలాంటి వ్యక్తులు పుడతారని ముందే గ్రహించి 'అపరిచితుడు' చిత్రం తీశారు. రాజారెడ్డిని చంపినట్టు జగన్ చెబుతున్నారు. రాజారెడ్డిని ఎందుకు చంపారు, ఏవిధంగా చంపారో ప్రజలకు బాగా తెలుసు. జగన్ క్రూరత్వం, వైఎస్ఆర్ అరాచకాలు, రాజారెడ్డి దమనకాండ చాలా మందికి తెలియదు. చర్చ చేపట్టడం ద్వారా జగన్ కుటుంబ నేపథ్యం అందరికీ తెలిసింది. రాజారెడ్డిని చంపిన వ్యక్తులను తాను ఏమీ చేయలేదని జగన్ చెప్పారు. మీ తాత హత్యలో ఉన్నవారిని మీ తండ్రి మిగల్చలేదు. ఆస్తులు ధ్వంసం చేశారు.. బుల్డోజర్లతో ఇళ్లన్నీ కూల్చారు. మిగిలింది పార్థసారథిరెడ్డి మాత్రమే.. ఆయన ఊతకర్రతో నడుస్తున్నారు" అని అచ్చెన్నాయుడు తెలిపారు.

# సెప్టెంబరు నాటికి ఎంవోయూల గ్రౌండింగ్

కూడిన సింగిల్ పోర్టల్‌తో డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలి. భూ కేటాయింపుల్లో మొదటగా పర్యాటక ప్రాజెక్టులకు.. తర్వాత ఐటీ కంపెనీలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అనుమతించినప్పటి నుంచి 18 నెలల్లో ఐటీ ప్రాజెక్టులు కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలి. సెమీకండక్టర్‌లు, ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ తయారీ ప్రాజెక్టులను ప్రోత్సహించాలి. గోవాను మరిపించేలా సూర్యలంక బీచ్‌ను తీర్చిదిద్దటానికి ప్రణాళికలు రూపొందించాలి. బాపట్ల బీచ్‌కు త్వరలో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి. ఏపీలోని 21 ప్రధాన ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం ప్రాజెక్టును వేగవంతం చేయాలి' అని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్దన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ పాల్గొన్నారు.

**పునరుత్పాదక విద్యుత్‌పై దృష్టి పెట్టాలి :** ట్రాన్స్‌మిషన్‌తో పాటు సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'రాష్ట్రం నిర్దేశించుకున్న 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యాన్ని వేగంగా పూర్తి చేయాలి. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు త్వరగా ఏర్పాటయ్యేలా చూడాలి. 2027 డిసెంబరు నాటికి 46 ఫుడ్ ప్రాసెసింగ్

## మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టులు ఉత్పత్తి ప్రారంభించేలా పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు జరపాలి. నౌకా నిర్మాణం, పోర్టులు, విమానాశ్రయాలు, ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలి' అని అన్నారు. ?య పరిశ్రమలకు ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేసే విషయమై త్వరితగతిన కార్యాచరణ చేపట్టాలని చంద్రబాబు సూచించారు. 'ఎంఎస్ఎంఈ రైట్ టు బిజినెస్ యాక్ట్‌ను వెంటనే అమల్లోకి తేవాలి. రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టులకు పర్యావరణ హిత సాంకేతికత వినియోగించాలి. తీర ప్రాంతాల్లో కాలుష్య కారకాలను సముద్రంలో విడిచిపెట్టకుండా చూడాలి. సూర్యలంక, మైపాడు బీచ్ ప్రాంతాల్లో పరిశుభ్రమైన పరిస్థితులు ఉండాలి' అని సూచించారు.

**మంత్రుల కమిటీ కృషి చేయాలి :** రాష్ట్రంలో ఏర్పాటవుతున్న పరిశ్రమలు నిర్దేశిత గడువులోగా కార్యకలాపాలు చేపట్టేలా చూడాలని మంత్రుల కమిటీకి సీఎం దిశానిర్దేశం చేశారు. బీపీసీఎల్, ఇండోసోల్, శ్రీసిటీ ఫేజ్-2 వంటి ప్రాజెక్టులకు భూసేకరణ వేగంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. 'బీపీసీఎల్ ప్రాజెక్టుకు అవసరమైన 3,000 ఎకరాల్లో.. 2,000 ఎకరాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మూడు రోజుల్లో పూర్తి చేశాం. రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ.11.47 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 282 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. వాటిలో 114 ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయ్యాయి' అని అధికారులు తెలిపారు.

**ఎంవోయూల స్థితిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ :** ప్రభుత్వంతో వివిధ సంస్థలు కుదుర్చుకున్న ఎంవోయూల ప్రస్తుత స్థితిపై మంత్రి లోకేశ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. మంత్రుల కమిటీ తీసుకున్న చర్యలు, ప్రస్తుత కార్యాచరణ, భవిష్యత్ ప్రాజెక్టుల గురించి వివరించారు. '23 నెలల్లో రూ.21,64,258 కోట్ల విలువైన 756 ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చాయి. వాటి ద్వారా 21,20,567 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఎంఎస్ఎంఈలకు అనుమతులు, ఇతర వివరాలను త్వరలో వెబ్‌సైట్ ద్వారా అందుబాటులోకి తెస్తాం' అని లోకేశ్ పేర్కొన్నారు.

# నోటిఫికేషన్ లేకుండానే స్త్రీనిధిలో 88 పోస్టుల భర్తీ

మహిళలకు ఉపాధి కల్పన కోసమంటూ బ్యాంకుల నుంచి అప్పుగా తెచ్చిన రూ.1,000 కోట్లను దారి మళ్లించింది. కూటమి అధికారంలోకి వచ్చాక దాన్ని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని కీలక పథకాలను అమల్లోకి తీసుకొస్తున్నారు. అయితే అప్పట్లో వైకాపా నాయకుల సిఫార్సులతో నియమితులైన కొంతమంది ఉద్యోగులు ఇప్పటికీ ఆ పార్టీకి వేగుల్లా పనిచేస్తున్నారని, ప్రస్తుతం స్త్రీనిధిలో తీసుకుంటున్న కీలక నిర్ణయాలను వైకాపాకు చేరవేస్తున్నారనే విషయాన్ని అధికారులు గుర్తించారు. తెదేపా ఎమ్మెల్యేలతో ఫోన్లు.. వైకాపా హయాంలో నిబంధనలకు విరుద్ధంగా నియమితులైన వారిలో కొందరు ఇప్పటికే తెదేపా ఎమ్మెల్యేలను ఆశ్రయించారు. వారి నుంచి సిఫార్సు లేఖలు తెస్తున్నారు. ఇతను మన వ్యక్తే అంటూ వారు కూడా అధికారులకు ఫోన్ చేసి చెబుతున్నారు. ఎక్కువగా ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేల నుంచి ఉన్నతాధికారులకు ఈ ఫోన్లు వస్తున్నాయి. స్త్రీనిధి అధికారులు కూడా వీరిలో కొందరికి వంతపాడుతున్నట్లు సమాచారం.

**పనితీరు ఆధారంగానే హెచ్‌ఆర్ పాలసీ**

స్త్రీనిధి సంస్థలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి హెచ్‌ఆర్ పాలసీ అమలు విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక తెదేపా అనుకూలురంటూ కొంతమంది సిబ్బందిని తొలగించి వారి పొట్టకొట్టారని, ఆ తరహా కక్షపూరిత రాజకీయాలను కూటమి ప్రభుత్వం చేయబోదని చెప్పారు. సచివాలయంలో గురువారం స్త్రీనిధి సంస్థ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. 'కూటమి వచ్చాక స్త్రీనిధి ద్వారా భర్తీ చేసిన అన్ని పోస్టులూ నోటిఫికేషన్, మెరిట్ ఆధారంగానే జరిగాయి. అన్ని జిల్లాల్లోనూ పోస్టుల్ని భర్తీ చేశాం. కానీ, వైకాపా పాలనలో కొన్ని జిల్లాలు, కొన్ని వర్గాలకు అసలు పోస్టులే ఇవ్వలేదు' అని చెప్పారు.

# జగన్‌పై మంత్రి నాదెండ్ల ఫైర్..

ఇప్పటికే 48 లక్షల మంది బుక్ చేసుకున్నారని చెప్పారు. "ఇది జగన్ ప్రభుత్వంలో లాగా బటన్ నొక్కే కార్యక్రమం కాదు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈకేవైసీ, ఆధార్ అనుసంధానం ద్వారా పారదర్శ కంగా అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో కోటి 20 లక్షల కనెక్షన్లు ఉన్నా, డబుల్ కనెక్షన్లు, కమర్షియల్ కనెక్షన్లు, అర్హత లేనివి పోగా, అర్హులందరికీ పథకం అందుతోంది" అని స్పష్టం చేశారు.

**మధ్యాహ్న భోజనంపై సవాల్ :** డొక్కా సీతమ్మ గారి స్ఫూర్తితో పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై జగన్ చేసిన విమర్శలను మనోహర్ తిప్పికొట్టారు. "పొరుగు రాష్ట్రాల్లో ఎక్కువ ధర ఉన్నా, మన రైతులు త్యాగం చేసి ప్రభుత్వానికి నాణ్యమైన బీపీటీ, సోనా మసూరి బియ్యాన్ని అందించారు. క్యూఆర్ కోడ్ ట్యాగింగ్‌తో పండించిన రైతు నుంచి పాఠశాలకు చేరే వరకు ప్రతి దశను పారదర్శకంగా ట్రాక్ చేస్తున్నాం. దమ్ముంటే ఏ పాఠశాలకైనా వచ్చి భోజనం నాణ్యతను పరిశీలించాలని జగన్‌కు నేను సవాల్ విసురుతున్నాను" అని అన్నారు.

**హెలికాప్టర్ వాడిన ఘనత జగన్‌ది :** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రయాణాలపై జగన్ చేసిన విమర్శలపై నాదెండ్ల తీవ్రంగా స్పందించారు. "ప్రపంచంలోనే అరుదైన రికార్డు జగన్‌కు ఉంది. ఉండవల్లిలోని తన ఇంటి నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని అమరావతికి హెలికాప్టర్‌లో వెళ్లిన మహానుభావుడు ఆయన. తన ఐదేళ్ల పాలనలో స్పెషల్ ఫ్లైట్లు, హెలికాప్టర్ల కోసం రూ. 222 కోట్లు ప్రజాధనం ఖర్చు చేసిన జగన్, ఈరోజు ఇతరులను విమర్శించడం హాస్యాస్పదం" అని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ పార్టీ పనులకు పార్టీ నిధులతో, వ్యక్తిగత పనులకు తన సొంత సంపాదనతో ప్రయాణిస్తారని, జగన్‌లా కాంట్రాక్టర్లను బెదిరించి ప్రైవేట్ విమానాల్లో తిరగలేదని అన్నారు.

**అమరావతిపై పైశాచిక ఆనందం :** అమరావతి రైతుల త్యాగాన్ని గుర్తించకుండా, ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి జగన్ చేసిన వ్యాఖ్యలను నాదెండ్ల తీవ్రంగా ఖండించారు. "అమరావతి రైతుల క్షోభను చూసి పైశాచిక ఆనందం పొందుతున్నారు. రాజధాని కోసం రైతులు పడిన బాధను, ప్రాణత్యాగాలను విస్మరించి మాట్లాడటం జగన్ అహంకారానికి నిదర్శనం. మూడు గీతలు గీస్తే రాజధాని అయిపోతుందనుకోవడం మూర్ఖత్వం. ఐదేళ్లు సీఎంగా పనిచేసిన వ్యక్తి, కనీస సమాచారం లేకుండా బురదజల్లే కార్యక్రమాలు మానుకోవాలి" అని హితవు పలికారు.

# పాస్టర్ అభినయ్ దర్శన్ వెనుక రాజకీయ కుట్ర

నమ్మించి ఆయన పాస్టర్ అవతారం ఎత్తారని ఆమె ఆరోపించారు. అక్కడ ఆయనపై ఎలాంటి దాడి జరగకపోయినా, జరిగినట్లుగా చిత్రీకరించి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఈ డ్రామా వెనుక ఎవరెవరు ఉన్నారనేది పోలీసుల దర్యాప్తులో త్వరలోనే పూర్తిగా బయటపడుతుందని ఆమె స్పష్టం చేశారు.

అభినయ్ దర్శన్‌పై గతంలోనే పలు క్రిమినల్ కేసులు ఉన్నాయని, సమాజంలో వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఆయన నిరంతరం ప్రయత్నిస్తున్నారని హోం మంత్రి వెల్లడించారు. కూటమి ప్రభుత్వాన్ని ఎలాగైనా అప్రదిష్ఠ పాలుచేయాలనే దురుద్దేశంతోనే ఈ విధమైన చర్యలకు పాల్పడుతున్నారా అనే యాంగిల్‌లో కూడా విచారణ సాగుతోందన్నారు.కూటమి ప్రభుత్వ హయాంలో ఇటువంటి నాటకాలు, కుట్రలు అస్సలు చెల్లవని, ఇలాంటి ఆలోచనలు ఇంకెవరికైనా ఉంటే తక్షణమే మానుకోవాలని ఆమె హితవు పలికారు. చట్టాన్ని అతిక్రమించి సమాజంలో అలజడులు సృష్టించాలని చూస్తే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కేసులో మరింత సమాచారం రాబట్టేందుకు అభినయ్ దర్శన్‌ను త్వరలోనే పోలీస్ కస్టడీలోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారిస్తామని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు.

# హీట్ వేవ్ పై రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత

గుర్తించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు నిరంతరం హెచ్చరికలు పంపాలని అధికారులకు సూచించారు. ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించాలని దిశానిర్దేశం చేశారు. తీవ్రస్థాయి ఎల్ నినో కారణంగా హీట్ వేవ్ తీవ్రత కూడా గణనీయంగా పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా రద్దీగా ఉన్న ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా తిరిగే చోట్ల చల్లని మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వడగాలుల నుంచి ఎలా రక్షించు కోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం సమాచారాన్ని చేరవేయాలని నిర్దేశించారు. ప్రజల ప్రాణాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండ తీవ్రత నేపథ్యంలో బయటకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని సూచించారు. ఈ అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి జిల్లా కలెక్టర్లు, మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 1349 హీట్ షెల్టర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు సీఎంకు వివరించారు. 446 ట్రాఫిక్ జంక్షన్లలో వాహనదారులు, పోలీసులకు నీడ కల్పించేలా ఏర్పాట్లు చేశామని తెలియచేశారు. మరోవైపు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న మూగ జీవులు, పక్షులకు కూడా నీటి తొట్టెలు, మట్టి కుండలతో నీటిని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.

**పచ్చదనం పెంపుపై దృష్టి :** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగు నీటి కొరత రాకుండా చూడాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. 2015లో బలమైన ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో 50.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డు అయ్యిందని.. ఈ ఏడాదిలోనూ ఎల్ నినో ప్రభావంతో ఇప్పటి వరకూ 48 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో నమోదు అయినట్టు అధికారులు వివరించారు. గడచిన మూడు రోజులుగా 45 డిగ్రీల నుంచి 48 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. భూగర్భ జలాలు పెరిగితే... పచ్చదనం పెరుగుతుందని... తద్వారా తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావం నుంచి కొంత మేర ఉపశమన లభిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. అన్నమయ్య జిల్లానే దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇతర జిల్లాలతో పోలిస్తే అన్నమయ్య జిల్లాలో తక్కువ ఉష్ణోగ్రత నమోదైందని స్పష్టం చేశారు. తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో హెచ్చరికలు, అప్రమత్తత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సమాచారం చేరవేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. వచ్చే వారం రోజుల పాటు నిత్యం ప్రజలను అప్రమత్తం చేసేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, పురపాలక, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి, విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఉపాధి కల్పన మా బ్రాండు.. గొడ్డలి జగన్ బ్రాండు







ఆంధ్ర రాష్ట్రం మొత్తం జమ్మలమడుగు వైపు చూస్తోంది. ఈ ప్రాంతానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ఉపాధి కల్పన చంద్రబాబు వల్ల మాత్రమే సాధ్యం. ఉపాధి కల్పన మా బ్రాండు.. గొడ్డలి జగన్ బ్రాండు. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనమిక్ రీజియన్లు నిర్మిస్తున్నాం. తిరుపతికి రాయల్ ఎన్‌ఫీల్డ్, ఫైటర్ జెట్ కంపెనీలు వస్తున్నాయి. గత పాలకులు కంపెనీలను తరిమేశారు.. మీరు ఎలాంటి భరోసా ఇస్తారని ప్రశ్నించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేసి చూపిస్తామని హామీ ఇచ్చాం. విధ్వంసం చేయడం నిమిషం పని.. నిర్మించడం ఎంతో కష్టం" అని లోకేశ్ అన్నారు.

**ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన లోకేశ్ :** రైతులను సేంద్రియ సాగువైపు ప్రోత్సహించాల్సిన అవసరముందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ సీఎం చంద్రబాబు లక్ష్యమని చెప్పారు. కడప జిల్లా పర్యటనలో భాగంగా జమ్మలమడుగు నియోజకవర్గం ముద్దనూరు మండలం పెనికలపాడులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని లోకేశ్ సందర్శించారు. సమీకృత సేంద్రియ సాగు చేస్తున్న రైతు మునగాల ద్వారకానాథ రెడ్డి, ఆయన సోదరుడు రమణారెడ్డి, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లడానికి గల కారణాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామంలో 70 ఏళ్ల వయసున్న సేంద్రియ రైతు లక్ష్మినారాయణను స్ఫూర్తిగా తీసుకుని తాము సేంద్రియ సాగు చేస్తున్నామని వివరించారు. మొదట ఒడిదొడుకులు ఎదుర్కొన్నా.. వ్యవసాయ అధికారుల ప్రోత్సాహంతో నిలదొక్కుకున్నామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో రైతు ద్వారకానాథరెడ్డి కుటుంబసభ్యులు ఇచ్చిన మామిడి పండును లోకేశ్ రుచి చూశారు. ఉమ్మడి కుటుంబానికి చెందిన 17 ఎకరాల్లో ద్వారకానాథ్‌రెడ్డి, రమణారెడ్డి ప్రకృతి సేద్యం చేస్తున్నారు.




పంటలు, పశుపోషణ, కోళ్లు, చేపల పెంపకం వంటి వాటిని ఒకదానికొకటి అనుసంధానం చేసి సమీకృత సేంద్రియ సాగు చేస్తూ స్థిరమైన ఆదాయం అర్జిస్తున్నారు. తమ పొలంలో మామిడి, బత్తాయి, ఉసిరి, కొబ్బరి, చిన్న నిమ్మ, నేరేడు, జామ, మునగ, రామాఫలం, సీతాఫలం పంటల సాగుతో పాటు 250 వరకు నాటుకోళ్ల పెంపకం, 60 వరకు పొట్టేళ్లు, చేపల సాగు చేస్తున్నారు.



ప్రకాశం



మార్కాపురం



బాపట్ల


షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

23.05.26 శనివారం


## సెన్సస్ నాలుగు రోజుల్లో పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 22)

హౌస్ లిస్టింగ్ సెన్సస్ ను నాలుగు రోజుల్లోగా పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. దీని పై శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గత జనాభా లెక్కలతో పోల్చితే ప్రస్తుత పరిస్థితులను బట్టి ప్రతిపాదిత వృద్ధికి, వాస్తవ సర్వేకు ఉన్న వ్యత్యాసంపై ఆయన ఆరా తీశారు. సర్వేలో ఎక్కడా లోపాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రారంభంతో పోల్చితే గత వారంలో మంచి పురోగతి కనిపించిందని, ఈ సర్వేను వేగవంతం చేయాలని ఆయన చెప్పారు. ఈ దిశగా క్షేత్రస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఒంగోలు మున్సిపాలిటీలో సెన్సస్ విధుల్లో ఉన్న సిబ్బందితో ఈ సందర్భంగా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి ముందుగా స్పెషల్ సీఎస్ రావత్, సెన్సెస్ డైరెక్టర్ నివాస్ (తరువాయి 4లో...)

## మైనింగ్ కార్యకలాపాలను డ్రోన్ ద్వారా సర్వే చేయిస్తాం

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 22)

జిల్లాలో జరుగుతున్న మైనింగ్ కార్యకలాపాలపై డ్రోన్ ద్వారా సర్వే చేయించబోతున్నామని కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. అధికారిక కార్యకలాపాలు, నేర, రోడ్డు ప్రమాదాల నివారణ, విస్తృత ప్రజాప్రయోజనాల కోసం డ్రోన్ల వినియోగం, సీసీ కెమెరాల ఏర్పాటు, సమగ్ర వివరాలతో 'డేటా లేక్' నిర్వహణపై అమరావతి సచివాలయం నుంచి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ సెక్రటరీ కాటంనేని భాస్కర్ శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఇందులో పాల్గొన్నారు. డ్రోన్లకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి ప్రజలకు అందించే వివిధ సేవలలో వీటి వినియోగాన్ని పెంచడం పై దృష్టి సారించాలని భాస్కర్ చెప్పారు. జిల్లాలోని అవసరాలను తమ దృష్టికి తీసుకువస్తే ఎంప్యానల్ అయిన ఏజెన్సీల నుంచి సర్వీసు లభించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన గ్రానైట్ గనులు ఉన్నాయని, అక్కడి పరిస్థితిని త్వరలో డ్రోన్ల ద్వారా సర్వే చేయిస్తామని చెప్పారు. నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ఉపయోగపడేలా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలను పెట్టబోతున్నట్లు భాస్కర్ చెప్పారు. సచివాలయంలోని రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ (ఆర్టిజిఎస్) కేంద్రంతో వీటిని అనుసంధానం చేస్తామన్నారు. ఈ దృష్ట్యా వీటిని పెట్టేందుకు ప్రాధాన్యత స్థలాలను జిల్లాలలో కలెక్టర్, ఎస్పీలు సమిష్టిగా గుర్తించాలని ఆయన అన్నారు. అదేవిధంగా పలు రంగాలలో సంబంధిత శాఖల మధ్య సమాచారంలో వ్యత్యాసం లేకుండా రాష్ట్రస్థాయిలో 'డేటా లేక్' ఏర్పాటు చేస్తున్నామని, వీటి ఆధారంగా జిల్లాల అభివృద్ధికి కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని భాస్కర్ చెప్పారు. (తరువాయి 4లో...)

## జిల్లాలో నూరు శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా పని చేయాలి

### అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశం



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 22)

మార్చి 2027 నాటికి జిల్లాలో 100% అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో ఉల్లాస్ అక్షర ఆంధ్ర జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండో విడతలో 70,957 మంది నిరక్ష్యరాస్యులు ఉన్నారని ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా అక్షరాస్యులు గా తయారు చేయడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 15 నుంచి 59 సంవత్సరాలు లోపు వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే మీ ముందున్న లక్ష్యమన్నారు. గ్రామాల్లో ప్రతిరోజు సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల లోపు అంగన్వాడి కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలలో ఎంపిక చేయబడిన కేంద్రాల్లో తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. ఉల్లాస అక్షర ఆంధ్ర కార్యక్రమం కింద 100 గంటలు పాఠ్యాంశాలు నేర్పించాలన్నారు. అదే విధంగా డిజిటల్ లిటరసీ, (తరువాయి 4లో...)

## చీరాలలో డిజిటల్ అరెస్ట్ మోసం

### ముగ్గురు అరెస్ట్



(షణ్ముఖ వెలుగు, చీరాల, మే 22)

'డిజిటల్ అరెస్ట్" పేరుతో రూ.26.50 లక్షలు మోసం చేసిన సైబర్ నేరస్థులను చీరాల 2 టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో విశాఖపట్నానికి చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చీరాల సబ్డివిజన్ డీఎస్పీ ఎండి మోయిన్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం చీరాల 2 టౌన్ పోలీస్స్టేషన్ పరిధిలోని కొత్తపేటకు చెందిన కె మోహన్రావును సోషల్ మీడియా ద్వారా సంప్రదించిన నిందితులు, తాము పోలీసులమని నమ్మించి మనీలాండరింగ్ కేసులో పేరు ఉందంటూ భయపెట్టారు. కేసు నుంచి బయటపడాలంటే డబ్బులు చెల్లించాలని బెదిరించి విడతల వారీగా రూ.26.50 లక్షలు వసూలు చేశారు. మోసపోయిన బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.బాపట్ల జిల్లా ఐటీ కోర్ బృందం సహకారంతో విచారణ జరిపిన పోలీసులు, మోసపూరితంగా తీసుకున్న నగదు మూడు బ్యాంకు ఖాతాల ద్వారా బదిలీ అయినట్లు గుర్తించారు. చీరాల 2 టౌన్ సీఐ శశికుమార్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం విశాఖపట్నానికి వెళ్లి నాగప్రదీప్, నీల్కుమార్లను అరెస్టు చేసింది. వారి వద్ద నుంచి వరుసగా రూ.8 లక్షలు, రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు బొందలపు గోవింద ఖాతాకు రూ.14 లక్షలు బదిలీ అయినట్లు గుర్తించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా (తరువాయి 4లో...)





## పొదుపు బాట పట్టిన "జీవీ"

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 22)

ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శావల్యాపురం మండలంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి వినూత్నంగా తరలివెళ్లారు. వినుకొండ పట్టణంలోని తన నివాసం నుండి ఆయన స్వయంగా ఎలక్ట్రికల్ స్కూటర్ పై బయలుదేరి, తన అధికారిక కాన్వాయ్ను పక్కన పెట్టి, కేవలం ఒకరిద్దరు సిబ్బందితో కలిసి దాదాపు 10 కిలోమీటర్ల మేర స్కూటర్ పైనే ప్రయాణించారు. మార్గమధ్యలో పలువురు పాదచారులు, వాహనదారులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఆయన, ఇంధన పొదుపులో వినుకొండ నియోజకవర్గం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలన్నదే తన సంకల్పమని, అందుకే తాను స్వయంగా ఈ-బైక్ పై ప్రయాణిస్తూ అవగాహన కల్పిస్తున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపుపై అవగాహన కలిగి ఉండాలని, రోజువారీ ప్రయాణాలు చేసేవారు పొదుపు నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. గ్రామాల్లో అంతర్గత పనులకు వెళ్లేటప్పుడు కార్లు, బైక్లకు దూరంగా ఉండి కాలినడకన ప్రయాణిస్తే ఇంధనం ఆదాతో పాటు శారీరక శ్రమ, వ్యాయామం జరిగి ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. నియోజకవర్గంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఇంధన పొదుపును దృష్టిలో పెట్టుకోవాలని కోరుతూ, ప్రస్తుత వేసవి తీవ్రత దృష్ట్యా విద్యుత్ను కూడా ఆదా చేయాలని, ఏసీల వాడకం, విద్యుత్ వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. కాగా గత వారం రోజుల నుండి జీవీ ఆంజనేయులు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కాన్వాయి కార్లు ఇతర వాహనాలు వినియోగించకుండా కేవలం ద్విచక్ర వాహనాలు ఎలక్ట్రికల్ స్కూటర్, సైకిల్ ని మాత్రమే ఉపయోగిస్తూ ప్రజలకు ఆదర్శవంతంగా నిలుస్తున్నారని పార్టీ నాయకులు, కార్యకర్తలు కొనియాడుతున్నారు. (తరువాయి 4లో...)

## సత్వర సమస్యల పరిష్కారమే నియోజకవర్గస్థాయి పీజీఆర్ఎస్ ల లక్ష్యం

### జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఎమ్మెల్యే కందుల

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 22)

సత్వరం సమస్యలను పరిష్కరించడమే నియోజకవర్గస్థాయి పీజీఆర్ఎస్ లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పట్టణంలోని మాధవి గ్రాండ్ ఇన్ లో శుక్రవారం నియోజకవర్గస్థాయి పీజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆమె ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి పాల్గొని కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నెల రోజుల సమయంలోనే అర్జీల పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేయడం ద్వారా అర్జీలకు సరైన పరిష్కారం దొరుకుతుందన్నారు. ఆ దిశగా రెవిన్యూ అధికారులు ముందుకు పోవాలని ఆదేశించారు. ఒక మంచి లక్ష్యంతో చేపట్టిన నియోజకవర్గ స్థాయి పీజిఆర్ఎస్ కార్యక్రమాలను విజయవంతం (తరువాయి 4లో...)



## వడ్డెర ఆర్థిక సాధికారత కోసం ప్రత్యేక కార్యక్రమం

**జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు**





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 22)**
ప్రభుత్వం వడ్డెర ఆర్థిక సాధికారత కోసం ప్రత్యేక కార్యక్రమం తీసుకువచ్చిందని దీన్ని అధికారులు ఒక ప్రణాళిక ప్రకారం అమలు చేసి వారికి సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక కలెక్టరేట్లోని ఆయన ఛాంబర్ లో శుక్రవారం గనులు భూగర్భ, రెవిన్యూ, బీసీ సంక్షేమ, సహకార, పరిశ్రమల శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఖనిజ సంపద కలిగిన ప్రభుత్వ భూములను గుర్తించి వడ్డెర సహకార సంఘాల ద్వారా కార్యకలాపాలు నిర్వహించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. క్వారీ లీజులు 33%, ప్రీమియం 50%, సీనరేజీ ఫీజుపై 50 శాతం రాయితీ వీరికి వర్తిస్తుందన్నారు. వడ్డెర సంప్రదాయ వృత్తిని పరిరక్షించడం, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించడం, స్థిరమైన గనుల కార్యకలాపాల ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించడం ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ఫారం బి ద్వారా దరఖాస్తు స్వీకరిస్తారని సొంత మండలం, గ్రామాల వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. జిల్లాలోని అర్హులైన వడ్డెర కులం వారు ఈ ప్రభుత్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 31వ తేదీ లోపు సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ పథకం గురించి అన్ని శాఖలు, గ్రామ సచివాలయాలు, ప్రజా ప్రతినిధుల ద్వారా ప్రచారం చేయాలని కోరారు. వడ్డెర సొసైటీ ఏర్పాటు రిజిస్ట్రేషన్ కోసం జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నెంబర్ 9441681976 సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనింగ్ అధికారి రవి ప్రసాద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి

**జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 22)**
జిల్లాలో ఈనెల 25 నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు నిర్వహించనున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ అడ్వాన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో శుక్రవారం ఈ పరీక్షలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద మంచినీరు, విద్యుత్తు, బందోబస్తు వంటి వాటిని ఏర్పాటు చేయాలన్నారు . ఎండల దృష్ట్యా విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా లో 10 వ తరగతికి సంబంధించి 12 సెంటర్లలో 1299 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 6 కేంద్రాల్లో 1028 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని విద్యాశాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఎస్.సుబ్బారావు, డిప్యూటీ డీఈవో ఎం. శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సత్వర సమస్యల పరిష్కారమే నియోజకవర్గస్థాయి పీజీఆర్ఎస్ ల లక్ష్యం






చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మొత్తం 71 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెవెన్యూకు సంబంధించి 40, ఇతర సమస్యలపై 31 అర్జీలు వచ్చినట్లు వివరించారు. పోయిన శనివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించామని, ఈ రోజు తిరిగి ఇదే కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే కొన్ని సమస్యలు పరిష్కారం అయ్యాయని, వచ్చే రెండు శుక్రవారాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి మిగతా సమస్యలను కూడా వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, డిఆర్ఓ వెంకట శివరామిరెడ్డి, ఆర్డిఓ ప్రభాకర్, హౌసింగ్ పీడీ మోహన్‌రావు, డిఎల్‌డిఓ బాలు నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సెన్సస్ నాలుగు రోజుల్లో పూర్తి చేయాలి

అన్ని జిల్లాల కలెక్టర్లతో అమరావతి సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్, డీఆర్వో శ్రీధర్ రెడ్డి, ఒంగోలు కమిషనర్ వెంకట కృష్ణయ్య, డిప్యూటీ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ వివరాల నివేదికను ప్రతిరోజూ తనకు పంపించాలని కలెక్టర్లను స్పెషల్ సీఎస్ ఆదేశించారు.








## పొదుపు బాట పట్టిన "జీవీ"

# రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కుర్మనాథ్**



**(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, మే 22)**
రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రీ-సర్వే, గ్రౌండు ట్రూతింగు, ఈ- కేవైసీ ప్రక్రియలను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర సర్వే, సెటిల్మెంటు, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కారంచేడు, ఇంకొల్లు గ్రామాలలో గ్రౌండు ట్రూతింగు, బాపట్ల మండలం చెరువు గ్రామం లో విలేజ్ సర్వేయర్ లాగిన్ జరుగుతున్న క్షేత్రస్థాయిలో రీ-సర్వే పనులను డైరెక్టర్ రోణంకి కుర్మనాథ్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బంది చేస్తున్న గ్రౌండు ట్రూతింగు, ఈ-కేవైసీ ప్రక్రియలను దగ్గరుండి గమనించిన డైరెక్టర్, అక్కడ ఉన్న రైతులు, రెవిన్యూ, సర్వే సిబ్బందితో ముఖాముఖి మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న పలు సాంకేతిక, భూ సమస్య లపై సుదీర్ఘంగా సమీక్షించారు. "రీ-సర్వే" ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగుతోందని చెప్పడానికి నిదర్శనంగా కారంచేడు, ఇంకొల్లు, బాపట్ల మండలం చెరువు గ్రామాలలో రాష్ట్ర డైరెక్టర్ కూర్మనాథ్ సమక్షంలోనే సిబ్బంది రైతుల భూ కమతాలను సర్వే చేసి డేటాను సేకరించారు. తమ కళ్ళ ముందే తమ సమక్షంలో అధికారులు సర్వే చేస్తుండటం పై స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సర్వే, సెటిల్మెంటు మరియు ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ ప్రజలు, రైతుల సమక్షంలో పనులు చేపట్టి పూర్తి చేస్తేనే అత్యుత్తమ ఫలితాలు వస్తాయి. భూ రికార్డుల ప్రక్షాళన, రైతులకు ఖచ్చితమైన భూహక్కులు కల్పించడమే లక్ష్యంగా రాత్రింబవళ్లు శ్రమిస్తున్న రెవిన్యూ, సర్వే సిబ్బంది సేవలు అభినందనీయం అని అధికారులను కొనియాడారు. క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో చీరాల ఆర్డీఓ లవన్న, మల్టీ జోన్ 2 అర్జెడి వెంకటేశ్వరరావు, జిల్లా సర్వే సహాయ సంచాలకులు శేషగిరిరావు, జిల్లా సర్వే ఇన్స్పెక్టర్ అల్తాఫ్, కారంచేడు, ఇంకొల్లు తహశీల్దార్లు నాగరాజు, శ్రీనివాస్‌తో పాటు స్థానిక మండల రెవిన్యూ, సర్వే సిబ్బంది, పెద్ద ఎత్తున రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో నూరు శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా పని చేయాలి


ఫైనాన్షియల్ లిటరసీ నేర్పించాలన్నారు. స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య నోడల్ అధికారి ప్రభాకర్, డిఆర్డిఏ పిడి నీలకంఠారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, డ్వామా పీడి నిర్మలాదేవి, ఐసిడిఎస్ ఇన్చార్జి పీడీ పద్మావతి, డిపిఓ వెంకటేశ్వరరావు, డిఇఓ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## చీరాలలో డిజిటల్ అరెస్ట్ మోసం




డీఎస్పీ మోయిన్ మాట్లాడుతూ "డిజిటల్ అరెస్ట్" అనే విధానం వాస్తవంలో లేదని స్పష్టం చేశారు. అపరిచితుల బెదిరింపులకు భయపడి ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు చెల్లించవద్దని ప్రజలకు సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, మిగిలిన నిందితులను కూడా త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు.

## మైనింగ్ కార్యకలాపాలను డ్రోన్ ద్వారా సర్వే చేయిస్తాం



## కిశోరి వికాశం పై అవగాహన



**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మే 22)**
మండలంలోని తంగిరాలపల్లి గ్రామ ఎస్సీ పాలెం అంగన్వాడీ కేంద్రం నందు దోర్నాల సీడీపీవో ఏ లక్ష్మీ బాయ్ అధ్యక్షతన శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఏ వయస్సులో ఎలాంటి ఆలోచనలతో ముందుకు వెళ్ళాలి, విద్య యెక్క ప్రాముఖ్యతను పూర్తిగా వివరించారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం మే నెల 1 నుండి జూన్ 11వ తేదీ వరకు ఆయా కేంద్రాల్లో శిక్షణ తరగతులు ను నిర్వహించి అవసరం అయిన సూచనలు ఇవ్వడం జరుగుతుంది. కిషోర్ బాలికలు సఖీ బాలికల, యావ బాలురుల గ్రూపు గా విభజించి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ సూపర్ వైజరు లు, లక్ష్మీ దేవి, అంజమ్మ, శ్యామ్ బాబు, మాజీ ఎంపీటీసీ మర్తమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు సుబ్బరతమ్మ, కృపామ్మ, కిషోర్ బాల, బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కానిస్టేబుల్ మస్తాన్ వలి అంత్యక్రియలకు ఆర్థిక సాయం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 22)**
ఒంగోలు ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ లో పనిచేస్తూ మరణించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ ఏ మస్తాన్ వలి అంత్యక్రియలకు ఏపీఎస్పీ 1995 బ్యాచ్ తరుపున వారి మట్టి ఖర్చులకు రూ.10 వేలు అందజేశారు. విజయవాడ పోలీస్ కానిస్టేబుల్ చెన్నరావు ఆధ్వర్యంలో వారి స్నేహితులు కానిస్టేబుళ్ళు రాఘవ, సురేష్ బాబు, షేక్ బాజీ సయ్యద్, శ్రీను, శంకర్ లు వారి కుటుంబ సభ్యులకు అందజేసారు.



# అద్దెకు సాగు యంత్రాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**(షణ్ముఖ వెలుగు, , మే 22)**
ఎపిఎమ్ అన్నదాతలకు పెట్టుబడి ఖర్చులు తగ్గించేందుకు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కస్టమ్ హైరింగ్ సెంటర్లు ద్వారా యంత్ర పరికరాలను మార్కెట్ కంటే తక్కువ ధరలకే అద్దెకు ప్రభుత్వం అందిస్తోందని వీటిని చిన్న,చిన్నకారు రైతూ సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని మండల ఎపిఎమ్



సుబ్బారావు అన్నారు. మండలంలోని వెలుగు డిఆర్డి ఆధ్వర్యంలో అద్యక్షులు శారదమ్మ అధ్యక్షతన ఎపిఎమ్ సుబ్బారావు పర్యవేక్షణలో మండల వ్యవసాయ అధికారి ఆర్ చంద్రశేఖర్ మరియు చీరాల ఉద్యాన శాఖ అధికారిని అలేఖ్య అతిథులుగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఇ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వెలుగు డిఆర్డి ఆధ్వర్యంలో కస్టమ్స్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల మండలంలో ఉన్నటువంటి చిన్న సన్నకారు రైతులకు కావాల్సిన వ్యవసాయ యాంత్రిక పరికరాలను అద్దెకు ఇవ్వటానికి ఏర్పాటు చేయటం చాలా సంతోషకరమన్నారు. ఈ సెంటర్లో ట్రాక్టర్, నాగలి, డ్రోన్, రోటవేటరు, గన్స మొదలగు రైతులకు ఉపయోగపడేటువంటి యంత్ర పరికరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఉన్నటువంటి చిన్న, సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఎపిఎం ఎం సుబ్బారావు మాట్లాడుతూ ఈ కస్టమ్ హైరింగ్ సెంటర్లు వల్ల రైతులకు తక్కువ ధరలకే వ్యవసాయ యాంత్రిక పరికరాలను ఇవ్వటానికి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తద్వారా చిన్న సంఘ రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ముఖ్యంగా రెండు ఎకరాలు లోపల ఉన్నటువంటి రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు వెంకటస్వామి, మాధవి, శ్రీలక్ష్మి, ఏపీ ఎంఎల్పి షరీఫ్, ఎమ్ఐఓ సిబ్బంది, వివోఏలు పాల్గొన్నారు.

# అంగనవాడి హెల్పర్లుకు అవగాహన



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 22)**
అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలు పరిచే కార్యక్రమాలపై అంగనవాడి హెల్పర్‌లకు అవగాహన కలిగి ఉండాలని సూపర్వైజర్ సుమలత అన్నారు. మండలంలోని చిన్నగంజాం టు అంగనవాడి కేంద్రంలో సూపర్వైజర్ ఎం సుమలత ఆధ్వర్యంలో అంగన్వాడి హెల్పర్లకు వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సుమలత మాట్లాడుతూ వేసవికాలంలో ఎండ ఎక్కువగా ఉంటుందని కేంద్రానికి పిల్లలు తీసుకు వచ్చేటప్పుడు టోపీ , గొడుగును వాడాలని అలాగే పిల్లల ఇంటిదగ్గర జాగ్రత్తగా తిసుకు వేళ్ళి తల్లిదండ్రులకు జాగ్రత్తగా అప్పజెప్పాలని తెలియజేశారు. ముఖ్యంగా అంగనవాడి కేంద్రంలోని లబ్ధిదారులకు సీఎంగా ఆఫీస్ నుండి ఐవిఆర్ఎస్ ద్వారా పిపిపి కాల్స్ వస్తున్నాయని వాటిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏఎంసీలో వచ్చే టి ఆర్ ఆర్ గురించి వాటి నాణ్యత, అంగనవాడి సెంటర్ వసతులు ఎలా ఉన్నాయని కాల్స్ వస్తున్నాయి. కాబట్టి వాటి గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సుమలత,అంగన్వాడి హెల్పర్స్ పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తే కోర్టుకు వెళ్తా



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 22)**
నియోజకవర్గంలో జూన్ 12వ తేదీన పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధిక ఫీజులు వసూలు చేసినా, పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్ లు అమ్మినా యాజమాన్యాలు, మండల, జిల్లా విద్యాశాఖ అధికారులపై కోర్టుకు వెళతానని జై భీమ్ రావు భారత్ పార్టీ ఇంచార్జ్ పులిపాటి హేబేలు శుక్రవారం మీడియా సమావేశంలో హెచ్చరించారు. పాఠశాలల ప్రారంభానికి ఒక రోజు ముందే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తరగతుల వారీగా నోటీసు బోర్డులో ఫీజుల పట్టికను ఉంచేలా మండల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. అధిక ఫీజులు, విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్ లు అమ్మితే విద్యా శాఖ చట్టం ప్రకారం శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వటంతో పాటు, పత్రికా ప్రకటనలు కూడా ఇవ్వాలని హేబేలు కోరారు. ప్రైవేట్ పాఠశాలలో బోధించే ఉపాధ్యాయుల అర్హత సర్టిఫికెట్లను విద్యాశాఖ అధికారులు పరిశీలించాలని తెలియజేశారు. గత విద్యా సంవత్సరంలో ముఖ్యంగా కొరిశపాడు మండలం తో పాటు ఇతర మండలాలలో కూడా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేయటంతో పాటు, బుక్స్, యూనిఫామ్ లు అమ్మినట్లు తన దృష్టికి వచ్చిందని ఈసారి అలా జరిగితే న్యాయస్థానాన్ని ఆశ్రయించి విద్యాశాఖ అధికారులతో పాటు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకునేలా తన కార్యచరణ ఉంటుందని హేబేలు స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 22)**
పేదల ఆరోగ్య భద్రత ను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఏపీ ప్రభుత్వం అందించడం జరుగుతుందని అందులో భాగంగా 46 మందికి 36 లక్షలు రూపాయల చెక్కులను అందించడం జరిగిందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు అన్నారు. నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇప్పటివరకు నియోజకవర్గం లో 19 కోట్ల 840 లక్షల రూపాయలు చెక్కులను లబ్ధిదారులకు అందించడం జరిగిందని



అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒంగోలు నియోజక వర్గం నుంచి ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించమని ఖర్చు భరాయించలేని వారికి ఖర్చులు40 శాతం ప్రభుత్వం నుంచి సహాయ అందించడం జరుగుతుందని ప్రతినెల లబ్ధిదారులకు చెక్కులు అందించే లక్ష్యంతో పనిచేయడం జరుగుతుందని తెలిపారు. ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఆసుపత్రిలో వైద్యం చేయించుకుని ఉంటే వెంటనే వారి యొక్క దరఖాస్తులను అందించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారికి కూడా సీఎంఆర్ ఎఫ్ చెక్కులను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు బండారు మదన్ ఏఎంసి చైర్మన్ రాచగొర్ల వెంకట్రావు, మాజీ ఏఎంసీ చైర్మన్లు కామేపల్లి శ్రీనివాసరావు, సింగరాజు రాంబాబు నగర కార్యదర్శి వెంకట్, పాలపర్తి లక్ష్మి నారాయణ, గోగినేని రామారావు, తదితరులు ఉన్నారు.

# గోశాలకు రాజస్థాన్ దాతల పశుగ్రాసం సాయం



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 22)**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానానికి సమీపంలోని శ్రీ హరిహర గోకులం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గోనుగుంట సుబ్బారావు నిర్వహిస్తున్న గోశాలకు పశు గ్రాసం కొరత ఏర్పడింది. విషయం తెలుసుకున్న అద్దంకిలో వ్యాపారాలు నిర్వహిస్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన దాతలు రెండు ట్రక్కుల వరిగడ్డిని అందజేశారు. పాపారావు ట్రాక్టర్ ద్వారా రవాణా సహాయం అందించారు. ప్రతి నెల నాలుగు ట్రక్కుల పశు గ్రాసం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని గోశాల నిర్వాహకులు గోనుగుంట సుబ్బారావు తెలిపారు. జంతు ప్రేమికులు గోమాత సేవలో భాగస్వాములు కావాలని కోరారు.

# ప్రతి రైతు ఫార్మర్ ఐడి కలిగి ఉండాలి

## మండల వ్యవసాయ అధికారి డి విజయ్ కుమార్



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 22)**
ఉలవపాడు మండల వ్యవసాయాధికారి డి విజయకుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు ఫార్మర్ ఐడి విధిగా కలిగి ఉండాలని, ప్రభుత్వం ద్వారా వచ్చు రాయితీలు, ప్రభుత్వపథకాలు పొందాలంటే ఫార్మర్ ఐడి ఉండాలని ప్రభుత్వం వారు తెలియజేసి ఉన్నారు. ఉదాహరణకు రైతుల కు సంబంధించిన ఎరువులు, సబ్సిడీ విత్తనాలు, యంత్ర పరికరాలు, పంట కొనుగోళ్లు, అలాగే అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ పథకాలు పొందాలి అన్నా 11 అంకెల గుర్తింపు సంఖ్య ఖచ్చితంగా ఉండాలి అంటున్నారు. కాబట్టి ప్రతి రైతు మీ దగ్గర లో ఉన్న రైతు సేవా కేంద్రం నకు వెళ్లి మీ ఆధార్, పొలంపాస్ బుక్ జెరాక్స్ కాపీ, ఆధార్ లింక్డ్ ఫోన్ నంబర్ చెప్పి రిజిస్ట్రేషన్ చేసుకొని ఫార్మర్ ఐడి పొందాలని తెలిపారు.

# మండలంలో డ్వామా పీడీ జోసెఫ్ కుమార్ ఆకస్మిక తనిఖీ





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 22)**
డ్వామా పీడీ జోసెఫ్ కుమార్ శుక్రవారం మండలంలోని కరేడు, రామాయపట్నం గ్రామాలలో ఉపాధి హామీ పనులను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి శ్రామికులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వం వారు అందిస్తున్న సౌకర్యాలు గురించి ఉపాధి శ్రామికులను అడిగి తెలుసుకున్నారు. వేసవి తాపం, వడగాల్పులు దృష్ట్యా ఉపాధి శ్రామికులు ఉదయం 5.30 కే వచ్చి సమయపాలన పాటించి కొలతల ప్రకారం పని చేసుకోవలసిందిగా సూచించేయడం జరిగినది. పని ప్రదేశము నందు ఏర్పాటుచేసిన టెంట్, నీళ్ల సౌకర్యం, శీతీం ప్యాకెట్స్, ప్రమాద చికిత్స కిట్ సౌకర్యాలను చూసి ఫీల్డ్ అసిస్టెంట్స్ ను అభినందించారు. గరిష్ట వేతనం వచ్చే విధంగా ఉపాధి శ్రామికులు తగు కొలతల ప్రకారం పని చేసుకుని గరిష్ట వేతనం పొందవలసిందిగా తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్ కుమార్ స్వయంగా ఓఆర్ఎస్ ప్యాకెట్స్ ఉపాధి శ్రామికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, ఏపీడి శ్రీనివాసులు, ఏపీవో అబ్దుల్లా, టిఏలు చెన్నయ్య, రసూల్ , ఫీల్డ్ అసిస్టెంట్స్ వెంకటరమణ, కళ్యాణ్ పాల్గొన్నారు.

## 23న రెవెన్యూ గ్రీవెన్స్ సెల్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 22) ఒంగోలు మండలం, పట్టణంలో రెవెన్యూ సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయని వాటి సమస్య పరిష్కారం కోసం ఈనెల 23వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు రెవెన్యూ గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు తెలిపారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల అనంతరం అధికారులందరూ మారడం జరిగిందని, రెవిన్యూ సమస్యలు పరిష్కారం కావడం లేదని, అందుకోసం ప్రత్యేకంగా ప్రతినెల ఒక రోజు కేటాయించి రెవిన్యూ సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు రెవెన్యూ గ్రీవెన్స్ నిర్వహిస్తామని అన్నారు. ఒంగోలు మండలం, ఒంగోలు పట్టణ ప్రజలందరూ కూడా ఈ గ్రీవెన్స్‌ను ఉపయోగించుకొని వారి యొక్క సమస్యలను పరిష్కారం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

## ఆత్మకూరు గ్రామంలో కిశోర వికాసం వేసవి సెలవులు కార్యక్రమం







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 22)
మండలంలోని కరేడు సెక్టార్‌లో గల ఆత్మకూరు1 అంగన్వాడి సెంటర్ నందు సిడిపిఓ డి మాధవి లత ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో కిశోర వికాసం వేసవికాల సెలవుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్థిక నిర్వహణ, బ్యాంక్ ఖాతా, పొదుపు, సేవింగ్ అలవాట్లు, డబ్బును ఆదా చేసుకోవటం అవసరాలు, పొదుపు డబ్బు తెలివిగా ఖర్చు చేయటం, సురక్షితంగా నిర్వహించడం, భవిష్యత్తు లక్ష్యాలు, ఆర్థిక ప్రణాళిక గురించి 11-18 సంవత్సరాల బాలికల బాలురులకు ఎస్‌హెచ్‌జి నెంబర్ మమత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎం నాగలక్ష్మి, ఆయాలు, పిల్లలు పాల్గొన్నారు.

## ఆర్థిక నిర్వహణ పై అవగాహన



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 22)
మండలంలోని పెద్ద వెంకన్నపాలెం గ్రామంలో శుక్రవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వాన ఆధ్వర్యంలో కిషోర వికాసం నిర్వహించారు. దీనిలో భాగంగా రిజ్వానా మాట్లాడుతూ ఆర్థిక నిర్వహణ, డబ్బులు పొదుపు చేయడం, ఆర్థిక ప్రణాళిక, ఎమర్జెన్సీ ఫండ్స్ గురించి అవగాహన కల్పించారు. కిషోర్ బాలికలకు వివరించి వాటి ప్రాముఖ్యత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, హెల్త్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ అవగాహన కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 22)
మానసిక ప్రశాంతత-ఒత్తిడి రహిత సేవల కోసం హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ అవగాహన కార్యక్రమం శుక్రవారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు జిల్లా పోలీసులు నిర్వహించారు. పోలీసు సిబ్బందిలో మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణ, ఏకాగ్రత, సంపూర్ణ శ్రేయస్సును పెంపొందించే లక్ష్యంతో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు మూడవ రోజు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు సిబ్బందికి హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ (హృదయపూర్వక ధ్యానం) శిక్షణా తరగతులు నిర్వహించారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్లలో ఈ తరగతులు జరుగుతున్నాయి. పోలీసులు నిత్యం ఒత్తిడితో కూడిన విధుల్లో నిమగ్నమై ఉంటారని, మానసిక, శారీరక ఒత్తిడి నుంచి ఉపశమనం పొంది ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడానికి ధ్యానం ఒక మంచి మార్గమని ఏఆర్ డీఎస్పీ కె శ్రీనివాసరావు తెలిపారు.



ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత లభించడంతో పాటు, సంపూర్ణమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవచ్చనే సదుద్దేశంతో ఈ శిక్షణా తరగతులు ఉపయోగపడతాయన్నారు. ఒంగోలులో హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ శ్రీరామచంద్ర మిషన్‌కు చెందిన భాస్కర్‌రెడ్డి, ఏ విజయ లక్ష్మి ల నేతృత్వంలో శిక్షణ తరగతులు జరిగాయి. ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు భావోద్వేగ నియంత్రణ, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. పోలీస్ సిబ్బందికి ధ్యాన పద్ధతులపై శిక్షణ అందించి, ధ్యానం వల్ల కలిగే మానసిక, శారీరక ప్రయోజనాలను వివరించారు. పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రమణారెడ్డి, ఆర్ఎస్ఐలు ప్రసాద్, మాల్యాద్రి, తిరుపతిస్వామి, బెటాలియం, ఈగల్ సిబ్బంది, పాల్గొన్నారు.



# కబ్జాలు జరిగిన స్థలాల పరిష్కారం ఎంతో అభినందనీయం

### ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 22)
ఒంగోలు ధారావారితోట 5వ లైన్ లో శ్రీ సహస్ర రెసిడెన్సి బిల్డింగులో ద్రావిడ దేశం కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రారంభించిన సౌత్ ఇండియన్ రియల్ ఎస్టేట్ సొల్యూషన్స్, అఫీషియల్స్ మ్యాట్రిమోనీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ఆఫీసు లోగోలను ముగ్గురు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ మా కుటుంబానికి అత్యంత ఆత్మీయులు, మా తాతగారైన స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు గారి అడుగుజాడల్లో నడుస్తున్న ద్రావిడ దేశం కృష్ణారావు ఈరోజు ఈ సంస్థలను ప్రారంభించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగంలో ఎప్పుడో కొన్న స్థలాలు కబ్జాలకు గురైతే వాటి సమస్యల పరిష్కారానికి కృష్ణారావు చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రసంగిస్తూ ద్రావిడ దేశం కృష్ణారావు చెన్నైలో ప్రతి తెలుగు వారికి సుపరిచితులేనని, అక్కడ తెలుగు ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుంటారని కొనియాడారు. మన పెద్దలు ఎప్పుడో కొన్న స్థలాలు కబ్జాలకు గురైతే ఆ స్థలాలను విడిపించడానికి కృష్ణారావు చేస్తున్న కృషి ఎంతో అభినందించాల్సిన విషయం అని అన్నారు. అదే విధంగా ప్రత్యేకంగా ఆఫీసర్స్ కొరకు ప్రారంభించిన మ్యాట్రిమోనీ కూడా విజయవంతం కావాలని మాగుంట శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, వుడా చైర్మన్ షేక్ రియాజ్, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, తెలుగుదేశం నాయకులు అడకా స్వాములు, హరిబాబు, శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.




## జిల్లా విద్యాశాఖ అధికారిని ఘనంగా సన్మానించిన ఎస్టీయూ



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మే 22)
మార్కాపురం జిల్లా అధ్యక్షా,ప్రధాన కార్యదర్శినూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన మార్కాపురం జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావుని మార్కాపురం జిల్లా ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టికెయస్ ప్రసాద్, ఆర్ దేశా నాయక్ సారథ్యంలో రాష్ట్ర, జిల్లా, మండల ఎస్టీయూ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, బొకేతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యాయవాణి కన్వీనర్ షేక్ యూసఫ్ షరీఫ్, కొమరోలు మండల అధ్యక్షులు పి రామ్ ప్రసాద్, తర్లుపాడు మండల అధ్యక్ష, ప్రధాన, ఆర్థిక కార్యదర్శులు కెవి జగన్ బాబు, నజీర్ అహ్మద్, అంజనీ కుమార్, కార్యవర్గ సభ్యులు సిహెచ్ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, హనుమంతరావు, అబ్దుల్ సుకూర్, ఆదినారాయణ, బొప్పరాజు శ్రీనివాసులు, రాజా రమేష్, ఎన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్రోల్మెంట్ 100% చేయాలి డీఈఓ సుబ్బారావు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 22)
మార్కాపురం జడ్పీహెచ్ పాఠశాలలో డీఈవో సుబ్బారావు ఆధ్వర్యంలో 21 మండలాల ఎంఈవోలతో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్య డాష్ బోర్డు అంశాలు కూలంకషంగా తెలుసుకోవాలని చెప్పారు. ఎన్రోల్మెంట్ 100% చేయాలని, డ్రాప్ జీరో శాతం చేయడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు శాతం మెరుగుపరచాలని సూచించారు. పాఠశాలల స్టార్ రేటింగ్ పెంచుకోవాలన్నారు.
ఈ కార్యక్రమంలో అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



# మూగజీవాల పై మృత్యువు పంజా

### జాతీయ రహదారిని దాటుతున్న గొర్రెల గుంపుపైకి దూసుకు వెళ్లిన ప్రైవేట్ బస్సు

### 30 గొర్రెలు అక్కడికక్కడే మృతి



(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, మే 22)

మండలంలోని మోక్షగుండంలో గురువారం అర్ధరాత్రి సమయంలో జాతీయ రహదారిని దాటుతున్న గొర్రెల గుంపుపైకి ఓ ప్రైవేట్ బస్సు దూసుకువెళ్లింది. ఈ ఘటనలో 30 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ప్రమాదంతో సదరు పాడి రైతు దాదాపు రూ.2 లక్షల మేర ఆర్థికంగా నష్టపోయినట్లు వాపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి ఘటన పై దర్యాప్తు చేపట్టారు.

# చిన్న వయస్సు నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలి

### సిడిపిఓ సులోచనా రాణి



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 22)

చిన్నగంజాం మండలంలోని రామకోటేశ్వర కాలనీ అంగన్వాడీ కేంద్రం నందు సిడిపిఓ సులోచనారాణి ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం సెక్షన్ 7 కార్యక్రమంలో భాగంగా ఆర్థిక నిర్వహణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ సులోచనారాణి మాట్లాడుతూ యువ, శక్తి గ్రూపుల బాలబాలికలకు బ్యాంక్ అకౌంట్ యొక్క ప్రాముఖ్యత, పొదుపు అలవాట్లు, సేవింగ్స్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు.అలాగే పొదుపు చేసిన డబ్బును అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకోవచ్చని అవగాహన కల్పించారు. చిన్న వయస్సు నుంచే పొదుపు అలవాటు పెంపొందించుకోవడం వల్ల భవిష్యత్తులో ఆర్థిక భద్రత కలుగుతుందని తెలియిజేసారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సులోచనారాణి, ఏడబ్ల్యూహెచ్ నాగమణి, ఎంఎస్కె, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలు నెరవేర్చటంలో కూటమి ప్రభుత్వం విఫలం

### కూటమి ప్రభుత్వ పాలనలో ఏ వర్గ ప్రజలకు సంతోషంగా లేరు

### అధికార, ప్రతిపక్ష పార్టీలు తోడు దొంగల్లా వ్యవహరిస్తున్నాయి

### ప్రభుత్వ తీరుపై బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ఫైర్

### త్వరలో బీసీవై ప్రజా భరోసా యాత్ర

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 22)



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చటం లో పూర్తిగా విఫలమైందని బీసీ వై పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ ధ్వజమెత్తారు. ఒంగోలులోని ఐఎంఏ భవన్లో శుక్రవారం బీసీవై పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బోడె రామచంద్ర యాదవ్ ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాధనం దోపిడీ, అవినీతి తప్ప ప్రజా పాలన కనిపించడం లేదన్నారు. రైతన్న పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. యువత ఉద్యోగ అవకాశాలు లేక, ఉపాధి లేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోపక్క రైతుల భూములను కారు చౌక గా కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారన్నారు. వీటిని ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం ప్రతి మీటింగ్ లో తనతండ్రులు, తాతల గురించి చెప్పుకోవడం తప్ప ప్రజా సమస్యలు పట్టలేదన్నారు. రాష్ట్రంలో ఉన్న రెండు రాజకీయ పార్టీలు తోడు దొంగల్లా వ్యవహరిస్తూ, రాష్ట్రాన్ని దోచుకు తింటున్నారు అన్నారు. విద్యావ్యవస్థలో ప్రక్షాళన తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యా హక్కులు చట్టాన్ని అమలు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తే, అదేదో ప్రభుత్వ ప్రగతి లాగా ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. త్వరలో బీసీవై పార్టీ ప్రజా భరోసా యాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో అడ్డుపెట్టుకొని విజయం సాధించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగణన కాకుండా, రిజర్వేషన్లు ఖరారు కాకుండా స్థానిక సంస్థలు ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల సమయానికి గ్రామీణ స్థాయి నుండి పార్టీని ప్రతిష్టపరిచి, వచ్చే ఎన్నికలలో అధికారం సాధిస్తామని పేర్కొన్నారు. బీసీవై పార్టీ జిల్లా అధ్యక్షులు చల్లా హరి మాట్లాడుతూ తనపై భరోసా ఉంచి తనకు జిల్లా అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించినందుకు బోడె రామచంద్ర యాదవ్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలను పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మీసాల సామ్రాజ్యం, బీసీవై పార్టీ కో ఆర్డినేటర్ అంగిరేకుల ఆదిశేషు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం


### - ప్రభుత్వ చీఫ్ విప్ జీవి - ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 22)

ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ సీనియర్ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు అన్నారు. వినుకొండ నియోజకవర్గ ప్రజల కోసం శావల్యాపురం ఎంపీడీవో ఆఫీస్ నందు శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కు ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. నియోజకవర్గం నలుమూలల నుండి ప్రజలు ప్రజా దర్బార్ కు హాజరై వారి సమస్యలను చీఫ్ విప్ జీవి ఆంజనేయులుకు విన్నవించుకున్నారు. ప్రతి ఒక్కరి సమస్యను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపుతానని చీఫ్ విప్ జీవి పేర్కొన్నారు.65 అర్జీలు వచ్చాయి శావల్యాపురం మండలంతోపాటు గ్రామాల్లో పింఛన్లు, సైడ్ డ్రైన్స్, సిసి రోడ్స్, భూసమస్యలు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వివిధ వర్గాల ప్రజలు విన్నవించారు. ఫిర్యాదులను పరిశీలించిన చీఫ్ విప్ జీవి ఆంజనేయులు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కూటమి పాలనలో ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని వివరించారు. సంక్షేమం అభివృద్ధి సమాంతరంగా నిర్వహిస్తూ ప్రజా ప్రభుత్వం గా ప్రజల మన్ననలు పొందిందన్నారు.





# పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 22)



ఆర్డీఎస్ఎస్ పనుల్లో భాగంగా కనిగిరి, కొప్పేరమ్, మల్లయ్యపాలెం, గార్లపేట, పెద్ద ఉళ్ళగళ్లు ప్రాంతాలలో నిర్మాణంలో ఉన్న 132 కేవీ, 33/11కేవీ సబ్‌స్టేషన్ పనుల పురోగతిని ఏపీసీపీడీసీఎల్ (ప్రాజెక్ట్స్) డైరెక్టర్ టీవీఎస్ఎన్ మూర్తి శుక్రవారం



పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు, విద్యుత్ పరికరాల ఏర్పాటు, లైన్ల అనుసంధానం తదితర అంశాల పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులను నాణ్యత ప్రమాణాలతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు ఆర్డీఎస్ఎస్ పనులు కీలకమని పేర్కొన్నారు. పనుల పురోగతి పై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, ఇంజినీర్లు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# డిజిటల్ అసిస్టెంట్లు, వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీల వేతనాల నిలిపివేత ఉత్తర్వులను తీవ్రంగా ఖండిస్తున్నాం

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మే 22)

అనంతపురం స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి ఇచ్చిన ఉత్తర్వుల ద్వారా జిల్లాలోని డిజిటల్ అసిస్టెంట్లు, వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీల మే నెల జీతాలను నిలిపివేయాలని చూడటాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండిస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ బాపట్ల జిల్లా చైర్మన్ జివివి రాఘవరెడ్డి శుక్రవారం ఓ ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ ఆధార్ కిట్ల వినియోగం, ఎల్.ఎమ్.ఎస్ కోర్సులు పూర్తి చేయలేదనే నెపంతో క్షేత్రస్థాయిలో రాత్రింబగళ్లు శ్రమిస్తున్న ఉద్యోగుల పొట్ట కొట్టేలా ఇటువంటి ఏకపక్ష ఉత్తర్వులు జారీ చేయడం అత్యంత బాధాకరమన్నారు. సచివాలయ సిబ్బంది కేవలం ఆధార్ సేవలకే పరిమితం కాలేదన్నారు. ప్రస్తుతం వారు జనాభా గణన, బిఎల్ఓ విధులు, ప్రతిష్టాత్మకమైన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, కౌసల్యం వంటి అత్యంత కీలకమైన ప్రభుత్వ విధుల్లో నిరంతరం నిమగ్నమై ఉన్నారన్నారు. తమ నిర్దేశిత జాబ్‌చార్ట్‌తో పాటు ప్రభుత్వం అప్పగించే ఇతర పనులు సిబ్బంది విజయవంతంగా నిర్వహిస్తున్నా వారిపై ఉన్న అదనపు పనిభారాన్ని గుర్తించకుండా, జీతాలు నిలిపివేస్తామని బెదిరించడం వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయడమే అని అన్నారు. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన జీతాలను నిలిపివేసే హక్కు ఎవరికీ లేదన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు, వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీల మే నెల వేతనాల నిలిపివేతకు జారీ చేసిన సదరు ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఈ జీతాల నిలిపివేత ఆదేశాలను రద్దు చేయవలసిందిగా కోరుతున్నామన్నారు.

# విజిలెన్స్ అధికారుల తనిఖీలు

### మూతబడ్డ పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలు



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 22)

పట్టణంలోని పలు విత్తనాలు ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, వ్యవసాయ శాఖ అధికారులు అకస్మిక తనిఖీలు నిర్వహించారు. విత్తనాల ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్స్ ప్రకారం నిల్వలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం రైతులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లులు ఇవ్వాలని, కృత్రిమ కోరత సృష్టించరాదని వ్యాపారులకు సూచించారు. నకిలీ విత్తనాలు, పురుగుమందుల అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారుల తనిఖీలుతో కొందరు వ్యాపారులు తమ దుకాణాలకు తాళాలు వేసి వెళ్లి పోయారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సిఐ చంద్రశేఖర్, విజిలెన్స్ తహశీల్దార్ మాధవి, వ్యవసాయశాఖ అధికారిని వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

# 27, 28 తేదీల్లో జరిగే వర్చువల్ మహానాడును విజయవంతం చేయండి

### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మే 22)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఈ నెల 27, 28 తేదీలలో నియోజకవర్గంలో జరిగే వర్చువల్ మహానాడుకు సన్నహాల్లో భాగంగా శుక్రవారం క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతానికి భిన్నంగా ఈసారి అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా పొదుపు చర్యలలో భాగంగా నిర్వహిస్తున్న నియోజకవర్గాల్లో వర్చువల్ మహానాడు ను దిగ్విజయం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మహానాడు ప్రతి క్లస్టర్‌లో నియోజకవర్గంలోని 11 క్లస్టర్లో 27, 28 తేదీలలో విడివిడిగా నిర్వహించాలని, దీని కొరకు ప్రతి క్లస్టర్‌లో టు వే కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 25వ తేదీ నుండి సుదర్శన క్రియ ద్వారా ఒక ప్రత్యేక యోగ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. దీని ద్వారా మనసు అదుపులో ఉంటుందని, మానసికంగా కూడా చాలా బలవంతులుగా మారుతారన్నారు. దీనికి ప్రతి తెలుగుదేశం నాయకుడు, కార్యకర్తలు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. దీని కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జిలు, యూనిట్ ఇంచార్జ్‌లు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.



# "కిశోరి వికాసం" ప్రత్యేక వేసవి శిబిరాల కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 22)

కనిగిరి మండలం నారపురెడ్డిపల్లి అంగనవాడి కేంద్రం నందు "కిశోరి వికాసం" ప్రత్యేక వేసవి శిబిరాల కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆర్థిక నిర్వహణ థీమ్ లో "బ్యాంకు ఖాతా పొదుపు, దొంగతనం" అంశం పై కిశోర బాలబాలికలు, మహిళలను ఉద్దేశించి పార్వతి మాట్లాడుతూ కౌమార వయసు నుంచే బాల బాలికలుడబ్బు విలువలను అర్థం చేసుకోవాలని, భవిష్యత్తు అవసరాల కోసం డబ్బును పొదుపు చేయడం చాలా అవసరమని, పొదుపు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఆర్థికంగా, స్వతంత్రంగా ఎదిగేందుకు అవసరమైన నైపుణ్యాలను, ఆలోచనలను పెంచుకోవాలన్నారు. బ్యాంకులో దాచుకున్న పొదుపు డబ్బుకు భద్రత ఎక్కువని, భీమా రక్షణ ఉంటుందని బ్యాంకు ఖాతాలు తెరవడం, డిజిటల్ పేమెంట్స్ గురించి నేర్చుకోవాలని, ఏటీఎం కార్డు మోసాలు, బ్యాంకు ఖాతాలల్లో దొంగతనం, మోసాల నుండి రక్షణ కొరకు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఆర్థిక నిర్వహణ వాటి ముఖ్య ఉద్దేశాలను గురించి, బాల్యవివాహ నిరోధక చట్టం- 20 26 గురించి అవగాహన కలిగించిరి. బాల బాలికలు, మహిళలు బ్యాంకు ఖాతాలో పొదుపు చేస్తామని బాల్యవివాహాలు చేసుకోబోమని, ప్రతిజ్ఞ చేశారు. తదుపరి గ్రామంలో కిశోరివికాసం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ఎం రమణమ్మ, గ్రామంలో కిశోర బాలబాలికలు, మహిళలు పాల్గొన్నారు.



## రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం

### ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 22)

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని ప్రభుత్వ చీఫ్ విప్,జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ వారి కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఒక ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. జీవీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' సంక్షేమ పథకాలను నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ, ప్రతి లబ్ధిదారునికీ చేరేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని సూచించారు.అభివృద్ధి, సంక్షేమ పథకాలే శ్రీరామరక్షగా రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి జెండాను ఎగురవేయడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో, అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పేలిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వ్యాపించిన మంటలు

### తప్పిన పెను ప్రమాదం



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 22)

పట్టణంలోని పాత ఎల్ ఐ సి బిల్డింగ్ వద్ద శుక్రవారం సాయంత్రం విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఒక్క సారిగా పేలిపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పేలడంతో పాటు మంటలు ఎగసిపడుతున్నాయి. దీంతో స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా బూత్ లెవెల్ ఏజెంట్లు, ఇన్‌ఛార్జ్‌లతో ప్రత్యేక సమావేశం





(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మే 22)

మాచర్ల నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి బూత్ లెవెల్ ఏజంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించడం జరిగింది. పట్టణంలోని పిఎల్ఆర్ కళ్యాణమండపం నందు పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్షేత్రస్థాయి నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లతో రాబోయే ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివేషన్) ప్రక్రియ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, మారిన వివరాల అప్‌డేట్ వంటి అంశాలతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. బూత్ స్థాయి కార్యకర్తలే పార్టీకి బలమైన పునాది అని పేర్కొన్నారు. ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా మనం అందర సమిష్టిగా కృషి చేసి పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు. ఈ సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బిఎల్ఎ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కందుల రవీంద్రారెడ్డి పూర్తి వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, మాచర్ల నియోజకవర్గ పరిశీలకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు, సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు రేపాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, మే 22)

మండలంలోని ప్రజలందరూ ప్రస్తుత వేసవి కాలంలో నమోదవుతున్న విపరీతమైన ఉష్ణోగ్రతల దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని ప్రముఖ వైద్య నిపుణులు, స్వస్థ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కట్ట సాయి తేజ సూచించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు.ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు వెళ్లకుండా ఉండాలని తెలిపారు. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తలకు టోపీ, గుడ్డ లేదా గొడుగు ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు తరచూ నీరు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని చెప్పారు.వేసవిలో చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు మరియు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ సాయి తేజ పేర్కొన్నారు. ఎండలో ఎక్కువసేపు పనిచేసే కార్మికులు, రైతులు మధ్య మధ్యలో నీడలో విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. శరీరంలో అలసట, అధిక దాహం, తలనొప్పి, వాంతులు, జ్వరం, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తే అవి వడదెబ్బ సంకేతాలు కావచ్చని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో వెంటనే సమీప వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు.అలాగే బయట విక్రయించే కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని, పరిశుభ్రమైన ఆహారం మాత్రమే తీసుకోవాలని సూచించారు.

# కనిగిరి పురపాలకసంఘంలో ఆపరేషన్ క్వీన్ స్వీప్ కార్యక్రమం

## మున్సిపల్ కమిషనర్ పి శ్రీధర్

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 22)

కనిగిరి పురపాలకసంఘంను స్వచ్ఛతలో ప్రథమ స్థానం పొందేందుకు ఆపరేషన్ క్వీన్ స్వీప్ కార్యక్రమం నుండి మే 23 శనివారం నుండి జూన్ 20వ తేది వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమీషనర్ శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు, కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, ఆపరేషన్ క్వీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు నాలుగు వారాల కార్యాచరణ ప్రణాళికా రూపొందిచినట్లు తెలిపారు. 36 రోజుల పాటు, 4 వారాల ప్రత్యేక ప్రణాళికతో మన రోడ్లు, డ్రైన్లు, మార్కెట్లు , ప్రజా మరుగుదొడ్లను శుభ్రంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. మొదటి వారంలో రోడ్లు, జంక్షన్లు, రెడ్, ఎల్లో స్పాట్స్ శుభ్రపరిచే కార్యాక్రమాలు, ప్రధాన రహదారులు మరియు వార్డు ప్రవేశ ప్రాంతాలను శుభ్ర పరచడం, చెత్త కుప్పల తొలగింపు, రెండవ వారంలో కాలువలు, డ్రైన్లు, వీధిల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు, మూడవ వారంలో వ్యర్థాల వర్గీకరణపై అవగాహన, మార్కెట్లు మరియు వ్యాపార ప్రాంతాలలో పరిశుభ్రత, పెద్ద వ్యర్థ ఉత్పత్తి దారుల తనిఖీలు, నాల్గవ వారంలో ప్రజా మరుగుదొడ్లను శుభ్రపరచడం, చెత్తకు గురయ్యే ప్రాంతాల పూర్తి శుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్ క్వీన్ స్వీప్ కార్యక్రమంలో మునిసిపల్, సచివాలయ, పట్టణ ప్రజలు, అధికారులు, ఎన్జీవోలు, ప్రజా సంఘాల నాయకులు భాగస్వామ్యం కావాలని కమీషనర్ కోరారు.



## తల్లిదండ్రులు ఇచ్చిన సొమ్మును దుర్వినియోగం చేయకూడదు

### కొండపి ప్రాజెక్టు సిడిపిఓ సుశీల దేవి





(షణ్ముఖ వెలుగు, కొండపి, మే 22)

కొండేపి మండలంలో కిషోర్ వికాసం సమ్మర్ క్యాంపులో భాగంగా ఆర్థిక నిర్వహణ కార్యక్రమాలు జరుగుచున్నాయనీ సిడిపిఓ సుశీల దేవి తెలిపారు. శుక్రవారం కుమ్మరిపాలెంలో జరిగిన కార్యక్రమానికి సిడిపిఓ బి సుశీల దేవి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలురు బాలికలు తల్లిదండ్రులు ఇచ్చిన సొమ్మును దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేసుకోవాలని తెలియజేశారు,సూపర్వైజర్ విక్టోరియా రాణి మాట్లాడుతూ చిన్నతనం నుంచి పొదుపులవాడు చేసుకోవడం నేర్చుకోవాలని అన్నారు,మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దని ఏ ఎస్ ఐ అంకారావు కోరారు. పంచాయతీ సెక్రెటరీ రామ్మోహన్రావు కాబోయే పౌరులు కాబట్టి పొదుపు చేయడం చాలా ముఖ్యమని చెప్పారు, ఈకార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు స్కూల్ హెచ్ఎం, ఆయాలు, బాలబాలికలు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

## కార్మిక కోడ్స్ పై ఖండన



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 22)

కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన కార్మిక కోడ్స్‌ను ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తుంది. కార్మిక వర్గాన్ని కార్పొరేట్ బానిసలుగా మార్చే ఈ కోడ్లని తక్షణమే ఉపసంహరించుకోవాలని యూనియన్ నాయకులు స్థానిక కలెక్టరేట్ వద్ద లేబర్ కోడ్ల ప్రతులను దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, మెడికల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐకె కృష్ణ మోహన్, రాష్ట్ర కమిటీ మెంబర్ సిహెచ్ చిరంజీవి , తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com